అవ్వాతాతలకు మరింత ఆసరా



పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్



ఆత్మకూరు 21వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ బోయ లక్ష్మమ్మ



పగిద్యాలలో విభిన్న ప్రతిభావంతురాలు జ్యోతికి నూతన పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ నెరవేరుస్తూ పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ 3 వేలకు పెంచడం వలన అవ్వాతాతలకు ఆర్థికంగా మరింత ఆసరాగా ఉపయోగపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కో ఆప్షన్ సభ్యులు రషీద్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం పెంచిన, నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ చైర్ పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పింఛన్ పెంచి ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆత్మకూరు పట్టణంలోని నూతనంగా పింఛన్లు మంజూరైన 71 మంది తొలిసారే రూ.3 వేల తీసుకోవడం ఎంతగానో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తిమోతి, వార్డు కనీ్వనర్లు కుర్షీద్, రఫి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 21వ వార్డులో శనివారం వృద్ధాప్య, వితంతు పింఛన్లను ఆ వార్డు సభ్యురాలు బోయలక్ష్మమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ వార్డు సచివాలయ ఉద్యోగులు, ఫింఛన్ దారులు పాల్గొన్నారు.

కల్లబొల్లి మాటలకు మోసపోవద్దు

పగిద్యాల: టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలకు మోసవద్దని, ఏ నాయకుని సిఫారసు లేకుండానే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని జెడ్పీటీసీ పుల్యాల దివ్య అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని వేడుకగా చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలు పథకాన్ని అమలు చేసి, ఎన్నికల మేనిఫెస్టో హామీలను 98 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. 2014లో చంద్రబాబు 650కి పైగా ఎన్నికల హామీలను ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. గతంలో పింఛన్‌ల కోసం కార్యాలయాల వద్ద, అధికారుల చుట్టు ఏలా అవస్థలు పడ్డారో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టి ఒకటో తారీఖునే ఇంటి తలుపు తట్టి పింఛన్‌లను అందించడం మరువరాదన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, డీపీఓ మంజువాణి, జేడీఏ మోహన్‌కుమార్, తహసీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పాకార్తీక్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం క్రీడాకారులకు పుట్టినిల్లు అని, ఈ ప్రాంతానికి చెందిన ఎంతో క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని చెప్పారు. క్రికెట్ పోటల అనంతరం వాలీబాల్, కబడ్డీ పోటీలను కూడా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 9న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, విజయచౌదరి, మహానంది దేవస్థానం చైర్మన్, వైఎస్సార్‌సీపీ మహానంది మండల అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, మొమిన్ మునీర్‌బాషా, బండిఆత్మకూరు మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సుల్తాన్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శిల్పాకార్తీక్‌రెడ్డిని బండిఆత్మకూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. జేసీఎస్ మండల అధ్యక్షులు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

కొత్తపల్లి: ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మేరి శనివారం తెలిపారు. గతేడాది డిసెంబర్ 26 నుంచి గ్రామస్థాయిలో టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, ఇతర క్రీడాపోటీలను నిర్వహించామన్నారు. అందులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను మండల స్థాయికి ఎంపిక చేశామని చెప్పారు. వారికి ఈ నెల 10 నుంచి 23వ తేదీ వరకు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

ధనుర్మాస ప్రత్యేక పూజలు

వెలుగోడు: పట్టణంలోని శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస పూజలను నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో గతేడాది డిసెంబర్ 23 నుంచి నిరంతర పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం సహస్ర పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లోభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 8న శ్రీ గోదా దేవి అమ్మవారికి సప్తహారతులు, దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పాములపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన నూర్‌అహ్మద్(66) అనే వ్యక్తి శనివారం మృతి చెందాడు. నవంబర్ 28న జరిగిన మండలంలోని కంబాలపల్లికి గ్రామానికి చెందిన నూర్‌అహ్మద్ ద్విచక్రవాహనం పై రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లిన విషయం విధితమే. కాగా కర్నూలు హాస్పిటల్‌లో చికిత్స పొందగా.. ఇటీవలే ఇంటికి తీసుకొచ్చారు. ఆరోగ్యం కుదుట పడుతుందనుకుంటున్న తరుణంలో మృత్యువాత పడటం కుటుంబీకులకు తీవ్ర శోకాన్ని మిగిల్చింది. ఎంపీడీఓ గోపీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రావులు మృతదేహానికి పూల మాల వేసి నివాళ్లులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

అక్షింతల పంపిణీ



అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న హిందూ ధర్మ సమ్మేళన కార్యకర్తలు

జూపాడుబంగ్లా: అయోధ్య శ్రీరాముల వారి అక్షింతలు శనివారం మండల కేంద్రంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన హిందూ ధర్మ సమ్మేళన కార్యకర్తలు గ్రామంలోని శ్రీరాముల వారి గుడి వద్ద నుంచి అక్షింతలను మేళ తాళాలతో ఊరిగింపుగా ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంట్లో ధూపదీప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సర్పంచు బాలమద్దిలేటి తెలిపారు. ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా గ్రామ స్థాయిలో సత్తాచాటి మండల స్థాయికి ఎంపికైన తూడిచెర్ల గ్రామ క్రీడాకారులకు శనివారం సర్పంచు బాలమద్దిలేటి చేతుల మీదుగా క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. అనంతరం కబడ్డీ, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు టీషర్టులు, టోపీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు చెన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రీసర్వేలో సమస్యలు నిల్

పాములపాడు: భూ రీ సర్వేలో రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. శనివారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో భూ రీ సర్వే పై తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. రెండవ విడతలో మండలంలోని మొదటగా తుమ్మలూరును ఎంపిక చేశారు. రీ సర్వే పూర్తి చేసి రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. అయితే వాటిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, విస్తీర్ణంలో తేడాలున్నాయా అని పరిశీలించేందుకు గ్రామ సభ నిర్వహించగా రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. భూ రీ సర్వే పై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, సర్వేయర్ భాస్కర్, వీఆర్వో సామేలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం లైవ్ టెలికాస్ట్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పగిద్యాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలన్న ఆశయంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ముఖాముఖీగా నిర్వహించే వికసిత్ భారత్ లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సోమవారం పగిద్యాల మండలంలో జరిగే వికసిత్ భారత్ పీఎం లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం కార్యచరణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే 17 పథకాలకు సంబంధించి ఒక్కొక్క పథకానికి ఇద్దరు లబ్ధిదారులను ఎంపిక చేసి ఏ విధంగా అభివృద్ధి చెందారో సహజ సిద్ధంగా మాట్లాడించాలని సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అవసరమయ్యే ఇంటర్‌నెట్ సౌకర్యం, ఎల్‌ఈడీ స్క్రీన్స్, ల్యాప్‌టాప్‌లు, విద్యుత్ సరఫరాకు అంతరాయ లేకుండా జనరేటర్, పెండ్యాలు, కుర్చీలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రొటోకాల్ పట్ల జాగ్రత్త తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ దాసు, డీపీఓ మంజువాణి, జేడీఏ మోహన్‌రావు, తహసీల్దార్ భారతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై జేసీ ఆగ్రహం

జేసీ వాహనానికి అడ్డుపడి నినాదాలు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలపై జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విధి నిర్వహణలో భాగంగా పగిద్యాలకు వచ్చిన ఆయన వాహనాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చుట్టుముట్టి తమ డిమాండ్‌లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. మూకుమ్మడిగా వాహనానికి అడ్డుపడడం మంచిది కాదని వారిపై జేసీ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వారి వినతి పత్రాన్ని స్వీకరించారు.

పెట్రోల్ బంకు పరిశీలన

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామం వద్ద ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. చుట్టు పక్కల పరిసరాలు తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రత్నరాధిక, డీటీ పఠాన్‌బాబు, సీఎస్‌డీటీ శ్రీనివాసులు, ఏఎస్‌ఓ ప్రసాద్, సర్వేయర్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో దాసు

నందికొట్కూరు రూరల్ : నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి కనీస వసతులపై తమకు సమాచారం ఇవ్వాలని ఆర్డీఓ దాసు అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీఈఓ సుధాకర్‌రెడ్డి, మండల తహసీల్దార్ రాజశేఖర్ బాబు, అన్ని మండలాల ఎంఈఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించి వాటిలో విద్యుద్దీకరణ, నీటిసరఫరా, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంపు నిర్మాణం తదితరవాటిపై నివేదిక ఇవ్వాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా పనులు చేయాల్సి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ, ఎన్నికల డీటీ కిషోర్, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ...

నందికొట్కూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్డీవో దాసు, తహసీల్దార్ రాజశేఖర్‌బాబులతో నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేషనల్ హైవే 340సీ పనులను గురించి తహసీల్దార్‌ను ఆరాతీశారు. హైవేలో భూములు కోల్పోయిన తమకు నష్ట పరిహారం అందలేదని కొందరు రైతులు జేసీ దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఆయన హైవే నిర్మాణ పనులను ఎవరూ అడ్డుకోవద్దని, నష్ట పరిహారం త్వరలోనే అందుతుందని వివరించారు.

నాటుసారా స్వాధీనం

మహానంది: గాజులపల్లె సమీపంలోని బుచ్చమ్మతోట గ్రామం వద్ద నాటుసారా విక్రయిస్తున్న నరసింహులును అరెస్ట్ చేసి 15లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా సారా విక్రయిస్తే సమాచారం అందించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. గాజులపల్లె–గిద్దలూరు ఘాట్ రోడ్డులో ఆంజనేయపురం వద్ద శనివారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని జూటూరు, రుద్రవరం గ్రామాల్లో సర్పంచులు నాయిని సావిత్రమ్మ, రామస్వామిల అధ్యక్షతన వికసిత్‌భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులునాయుడు, ఏఓ ఫణీశ్వరరెడ్డి, పశు వైద్యాధికారి అనిల్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, టీబీ సూపర్వైజర్ రవికుమార్ తదితరులు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం డ్రోన్ ద్వారా పైర్లకు మందు పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

నందికొట్కూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా శ్లోక హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. బాలికలు వేసిన ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు కవిత, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎస్మా ఉపయోగించడం సరికాదు

ఆత్మకూరు: అంగన్‌వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం ఎస్మా చట్టం ఉపయోగించడం సరికాదని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సురేంద్ర, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహం ఏర్పాటుకు ప్రతిపాదనలు



రికార్డులు పరిశీలిస్తున్న అలెస్కో కో–ఆర్డినేటర్

వెలుగోడు: మండలంలో గిరిజన వసతి గృహం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా అలెస్కో కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని విజయదుర్గా చెంచుకాలనీలో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. గిరిజన పాఠశాలలో ఎంత మంది చదువుతున్నారని ఎంఈఓ బ్రహ్మంనాయక్‌ను ఆరా తీశారు. ఈ సందర్భంగా నలుగురు విద్యార్థుల ఆధార్ కార్డులు అప్‌డేట్ కావడం లేదని హెచ్ఎం కో ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ..ఎంపీడీఓతో మాట్లాడి అప్‌డేట్ చేయించాలని సూచించారు. అదేవిధంగా ఇంటి వద్దే ఉంటూ చదువుకుంటున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను ఐఈఆర్‌సీ పీవీడీఎస్ రావు పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు వకీల్, అరుణ, నాగన్న పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణ శివార్లలోని పొలంలో శుక్రవారం ఒంటరిగా గడ్డి కోసుకుంటున్న మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడు సోంపల్లి శంకరయ్య అనే యువకుడిని ఆత్మకూరు పోలీసులు పట్టుకున్నారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ ఆవరణలో డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కరివేన గ్రామానికి చెందిన సోంపల్లి శంకరయ్య పాత నేరస్తుడని, గతంలో ఇతనిపై రెండు కేసులున్నాయని తెలిపారు. గతంలో పట్టణంలోని సాయిబాబానగర్‌లో వాకింగ్ చేస్తున్న మహిళ చైన్ స్నాచింగ్ చేస్తూ పట్టుబడ్డాడని, ఈ నేర స్వభావంతోనే అతను చెరువు సమీపంలో ఒంటరిగా మహిళ కనపడడంతో ఆమెపై అత్యాచారయత్నానికి ఒడిగట్టాడన్నారు. ఆ మహిళ గట్టిగా ప్రతిఘటించడంతో పాటు కేకలు వేయడంతో పక్క పొలాల లోని వారు అక్కడికి చేరుకోవడంతో నిందితుడు మొక్కజొన్న చేలోకి జొరబడి పారిపోయాడని చెప్పారు. విషయం ఆత్మకూరు పోలీసులకు తెలియడంతో వారు సకాలంలో స్పందించి డ్రోన్‌ల సహకారంతో మొక్కజొన్న తోటంతా వెతికారన్నారు. ఆ తరువాత సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించి 24 గంటల్లో అతన్ని అరెస్టు చేసిన ఎస్ఐలు కృష్ణమూర్తి, నారాయణ రెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. నిందితుడు సోంపల్లి శంకరయ్యపై రౌడీషీట్ తెరుస్తున్నట్లు వెల్లడించారు.